
సాక్షి కాకినాడ

శుక్రవారం । 10 । మే । 2024



రూ.లక్ష విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారి నిత్యాన్నదానం ట్రస్టుకు వి.సత్యనారాయణ దంపతులు (తణుకు) గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 100, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టాకు 2,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
39.0°/24.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	38.5	24.0
కాకినాడ	35.6	27.6
అమలాపురం	39.0	27.0

న్యూస్‌రీల్

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



ముద్రగడను కలసిన యాదవులు, విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు

కిర్లంపూడి: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి యాదవులు, విశ్వ బ్రాహ్మణ సంఘాల నాయకులు కిర్లంపూడి గురువారం వచ్చి, ముద్రగడను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి, వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేయాలని కోరారు. నిరుద్యోగ యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా 50 కుటుంబాలతో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయించాలని సూచించారు. కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

సత్యదేవుని దర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ కిరణ్మయి దంపతులకు వేదాశీస్సులు అందజేస్తున్న పండితులు

అన్నవరం: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి మండవ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం పండితులు వేదాశీస్సులు అందజేశారు. సత్యదేవుని ప్రసాదాలను ఆలయ ఏఈఓ కృష్ణారావు బహూకరించారు.

జిల్లా కలెక్టర్‌ను కలసిన ట్రైనీ ఐపీఎస్‌లు

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాకు వచ్చిన ఎనిమిది మంది ట్రైనీ ఐపీఎస్ అధికారులు.. ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్‌తో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్న ఈ ఐపీఎస్ అధికారులు జిల్లాలో జరుగుతున్న ఎన్నికల విధుల్లో భాగస్వాములు కానున్నారు. వారికి జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు, పరిపాలన, భద్రతాపరమైన అంశాలను కలెక్టర్ నివాస్, ఎస్పీ సతీష్ కుమార్ వివరించారు. ఎన్నికల సందర్భంగా జిల్లా అధికారులు, సిబ్బంది నిర్వహించే విధుల్లో ట్రైనీ ఐపీఎస్‌లు స్వయంగా పాల్గొని వివిధ అంశాలపై అవగాహన పెంపొందించుకోనున్నారని కలెక్టర్ తెలిపారు. అనంతరం స్పందన హాలులో ఏర్పాటు చేసిన జిల్లా కంట్రోల్ రూమును ట్రైనీ ఐపీఎస్‌లు సందర్శించారు. కంట్రోల్ రూములోని సువిధ, 1950 కాల్ సెంటర్, అకౌంటింగ్ టీమ్, సీ-విజిల్, మీడియా ప్రసారాలు, చెక్‌పోస్ట్ వెబ్ కాస్టింగ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీములు (ఎస్ఎస్‌టీ), ఫ్లయింగ్ సర్వైలెన్స్ టీములు (ఎఫ్ఎస్‌టీ) వంటి వాటి పని తీరును జిల్లా పంచాయతీ అధికారి కె.భారతీ సౌజన్య ట్రైనీ ఐపీఎస్‌లకు వివరించారు.



వైఎస్సార్ స్కేటింగ్ రింక్



కొండయ్యపాలెం వద్ద వినియోగంలోకి వచ్చిన ముత్తా గోపాలకృష్ణ వారధి



రాగిరెడ్డి కళాక్షేత్రం

కాకినాడ.. వెరీ స్మార్ట్

- ఐదేళ్లుగా రూ.2 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమం
- రూ.58 కోట్లతో 4 లేన్ల రోడ్లు
- రూ.20 కోట్లతో కన్వర్టబుల్ స్టేడియం
- రూ.20 కోట్లతో రాగిరెడ్డి కళాక్షేత్రం
- రూ.15 కోట్లతో సైన్స్ సెంటర్
- రూ.9 కోట్లతో వైఎస్సార్ స్కేటింగ్ రింక్
- ప్రారంభమైన కొండయ్యపాలెం ఫ్లై ఓవర్

కాకినాడ: పెన్షనర్స్ ప్యారడైజ్‌గా, రెండో మద్రాసుగా పేరున్న కాకినాడ నగరం గడచిన ఐదేళ్లలో అటు అభివృద్ధి, ఇటు సంక్షేమ పరంగా 'స్మార్ట్'గా రూపుదిద్దుకుంది. చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా అన్ని రంగాల్లో జరిగిన ప్రగతి నగర ప్రతిష్టను మరింత పెంచింది. అభివృద్ధికి చిరునామాగా, సంక్షేమానికి మారుపేరుగా నిలిచింది. ప్రజలు మెచ్చేలా పరిపాలన ఈ ప్రాంత రూపురేఖలను సమూలంగా మార్చగలిగింది.

గతంలో కానరాని ప్రగతి

గత పాలకుల అవగాహన రాహిత్యం, అవినీతి కారణంగా 2014 నుంచి 2019 వరకూ అభివృద్ధి పరంగా కాకినాడ ఎంతో వెనుకబడింది. అందుబాటులో అన్ని వనరులూ ఉన్నా.. వాటిని సద్వినియోగం చేసుకుని, అభివృద్ధి చేయంలో అప్పటి టీడీపీ నేతలు ఘోరంగా విఫలమయ్యారు. కాకినాడకు స్మార్ట్ సిటీ హోదా దక్కి రూ.970 కోట్లు మంజూరైనప్పటికీ.. నగరాన్ని అభివృద్ధిలో పరుగు పెట్టించలేకపోయారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తరువాత ప్రణాళికబద్ధమైన పాలనా సంస్కరణలతో కాకినాడ నగర రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. ఫలితంగా అభివృద్ధి పరంగా ఈ నగరం అగ్రగామిగా నిలిచింది.

శరవేగంగా 'స్మార్ట్' ప్రాజెక్టులు

- **కాకినాడ స్మార్ట్ సిటీ నిధులు వెచ్చించి, అనేక ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేయించి, వినియోగంలోకి తీసుకుని వచ్చారు.**
- రూ.15 కోట్ల వ్యయంతో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు, సైన్స్ ఎగ్జిబిషన్ల నిర్వహణకు దీనిని నిర్మించారు. భవన నిర్మాణం పూర్తయ్యింది. ఇక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి, త్వరలో వినియోగంలోకి తీసుకురానున్నారు.
- రూ.20 కోట్లతో రాగిరెడ్డి కళాక్షేత్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. కళల కాణాచిగా పేరొందిన కాకినాడ నగరంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు 800 సీటింగ్ సామర్థ్యంతో సెంట్రలైజ్డ్ ఏసీతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.
- **రూ.9 కోట్లతో వైఎస్సార్ స్కేటింగ్ రింక్‌ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించారు. అంతర్జాతీయ స్థాయి పోటీలు నిర్వహించేందుకు వీలుగా ఈ తరహా ఇండోర్ స్టేడియం నిర్మించడం రాష్ట్రంలోనే ఇదే తొలిసారి.**
- టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్ క్రీడా పోటీలు ఒకేచోట నిర్వహించేందుకు వీలుగా రూ.20 కోట్లతో కన్వర్టబుల్ స్టేడియం నిర్మించారు.
- ఇవికాకుండా రూ.58 కోట్లతో మూడు ప్రాంతాల్లో నాలుగు లేన్ల రహదారులు కూడా అభివృద్ధి చేశారు.
- నగర ప్రజల జిహ్వాచాపల్యాన్ని తీర్చేలా.. కాకినాడ పీఆర్ కళాశాల రోడ్డులో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ అన్ని రకాల ఆహార పదార్థాలతో సుమారు 100 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇవి సాయంత్రం నుంచి రాత్రి వరకూ అందుబాటులో ఉంటాయి. ఇక్కడకు సామాన్యులతో పాటు అనేక మంది కార్లలో సైతం వచ్చి, రకరకాల రుచులను ఆస్వాదిస్తూ.. ఆహ్లాదంగా గడుపుతున్నారు.
- **సుమారు 20 దశాబ్దాలుగా పడకేసిన కొండ**య్యపాలెం ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణాన్ని ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పట్టుదలతో పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వచ్చారు. తద్వారా నగరంలో కొండయ్యపాలెం రైల్వే గేటు వద్ద వేలాది మంది ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీరాయి.
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు సెంటు భూమి కానీ, గజం స్థలం కానీ ఇవ్వలేదు. అటువంటిది ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నగరానికి చెందిన సుమారు 30 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఆ స్థలాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు సుమారు రూ.650 కోట్లు ఖర్చు చేశారు.

సంక్షేమానికి చిరునామా

జిల్లా కేంద్రమైన కాకినాడను అభివృద్ధితో పాటు సంక్షే**మంలో కూడా ప్రథమ స్థానంలో** నిలిపారు. కులమత **రాజకీయాలకు అతీతంగా కేవల**ం అర్హతే ప్రామాణికం**గా తీసుకుని వేలాది మందికి స**ంక్షేమ ఫలాలు అందించారు. నగరంలో దాదాపు 94 వేల కుటుంబాలు ఉండగా.. వీటిలో 82 వేల కుటుంబాలకు సంక్షేమ ఫలాల లబ్ధిని అందించారు. ఇది పారదర్శక పాలనకు నిదర్శనమని ప్రజలే చెబుతున్నారు. నగరంలో వివిధ సంక్షేమ పథకాల కింద 1,31,594 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.308.85 కోట్ల మేర జమ చేశారు. ఇవి కాకుండా ఇతర పథకాలు ద్వారా రూ.64.87 కోట్లతో అనేక పనులకు శ్రీకారం చుట్టారు.

అర్హులందరికీ పింఛన్లు

వైఎస్సార్ పింఛన్ కానుక విషయంలో కూడా పేదలకు పెద్దపీట వేశారు. ఒకప్పుడు పట్టుమని పది వేల మంది కూడా పింఛన్ల లబ్ధిదారులు ఉండేవారు కాదు. ప్రస్తుత ప్రభుత్వం అర్హతను మాత్రమే ప్రామాణికంగా తీసుకోవడంతో ఎంతో మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగుల వంటి నిరుపేద వర్గాలకు మేలు జరిగింది. నగరంలో వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా సుమారు 30 వేల మంది లబ్ధి పొందుతున్నారు. మొత్తం మీద గడచిన ఐదేళ్లలో కాకినాడ నగరం అటు అభివృద్ధి, ఇటు సంక్షేమ పరంగా ఊహించని ప్రగతిని సాధించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు, ఆ పార్టీ నేతల అవినీతి కారణంగా అర్హులకు అన్యాయం జరిగితే.. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నిజమైన పేదలందరికీ న్యాయం జరిగేలా పథకాలను అమలు చేయగలిగారు.



పీఆర్ కాలేజీ రోడ్డులో ఏర్పాటు చేసిన ఈట్ స్ట్రీట్



నగరంలో అభివృద్ధి చేసిన రహదారి

ఆలయ గోడపై సత్యదేవుని చరిత్ర

- యంత్రాలయం లోపల స్వామి ఆవిర్భావం వివరాలు
- ఆలయ నిర్మాణ సమాచారమూ నిక్షిప్తం

అన్నవరం: రత్నగిరిపై స్వయంభువుగా వెలసిన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయానికి 135 సంవత్సరాలకు పైబడిన చరిత్ర ఉంది. అయితే, దీని గురించి పుస్తకాల్లో తప్ప ఆలయంలో ఎక్కడ శిలా శాసనాలుగా కానీ మరే ఇతర రూపాల్లో కానీ భక్తులు తెలుసుకునేలా ఎటువంటి ఏర్పాటూ ఇప్పటి వరకూ లేదు. ఈ నేపథ్యంలో స్వామివారి చరిత్రను దేవస్థానం ఈఓ, దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ శిలాశాసనంగా చెక్కించారు. స్వామివారి యంత్రాలయం లోపల ఈశాన్య దిశగా భక్తులు వెలుపలకు వచ్చే ద్వారం పక్కన గ్రానైట్ గోడపై దీనిని తెలుగులో క్లుప్తంగా చెక్కించారు. యంత్రాలయ దర్శనానంతరం భక్తులు ఈ శాసనాన్ని చదివి, స్వామివారి ఆలయ చరిత్ర తెలుసుకుంటున్నారు.

ఏం చెక్కించారంటే..

'తొలుత రత్నగిరిపై సత్యనారాయణ స్వామివారి విగ్రహం 1891వ సంవత్సరం ఖర నామ సంవత్సరంలో శ్రావణ శుద్ధ విదియ నాడు కనుగొనడమైనది. తదుపరి విజయ నామ సంవత్సరంలో 29.12.1893న మొట్టమొదటిగా నిర్మించిన ఆలయంలో స్వామివారి ప్రతిష్ఠ జరిగింది. అనంతరం తిరిగి 1933-34లో ఆలయాన్ని స్థానికంగా లభించిన రాయితో పునర్నిర్మించారు. అది శిథిలావస్థకు చేరినందున 2010లో దాని తొలగింపు ప్రక్రియ చేపట్టి, పూర్తి చేయడమైనది. 28.04.2011న ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. తమిళనాడులోని నమ్మక్కల్ నుంచి గ్రానైట్ రాయి తెచ్చి, ఉలులతో చెక్కించి ఆ రాతితో యథాతథంగా ఆలయం పునర్నిర్మాణం జరిగింది. 14.03.2012న ఫాల్గుణ బహుళ సప్తమి నాడు స్వామివారిని పునఃప్రతిష్ఠించుట జరిగింది' అని ఆలయ గోడపై చెక్కించారు.



యంత్రాలయం గోడపై ఆలయ చరిత్ర చెక్కుతున్న దృశ్యం

ఎటువంటి వివాదాలూ లేకుండా..



ఈ ఆలయాన్ని 2011లో పునర్నిర్మించేందుకు ప్రయత్నాలు చేసినపుడు పురావస్తు శాఖ వారు.. ఇది వందేళ్ల పైబడిన చరిత్ర కలిగిన ఆలయమని.. అందువలన దీనిని తొలగించరాదని అభ్యంతరం చెప్పారు. అప్పుడు ఈ ఆలయ చరిత్రను వారికి వివరించి, పాత ఆలయం 1933-34లో మాత్రమే నిర్మించారని తెలియచేసి ఆలయ పునర్నిర్మాణం చేశాం. భవిష్యత్తులో ఆలయ చరిత్రపై ఎటువంటి వివాదాలూ లేకుండా స్పష్టమైన వివరాలతో కూడిన శాసనం వంటిది ఉండాలని భావించి, యంత్రాలయంలోని గ్రానైట్ రాతి గోడపై దీనిని చెక్కించాం. ఇటువంటి ప్రకటనను ఆలయ ప్రాంగణంలో కూడా ఫ్లెక్సీలపై ప్రదర్శిస్తాం.

– కె.రామచంద్ర మోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం

ప్రచార ఖర్చులపై ప్రత్యేక దృష్టి

- నామినేషన్ దాఖలు నుంచి ఫలితాల వరకూ లెక్కింపు
- బిల్లులతో సహా వివరాలు అప్పగించాల్సిందే
- పరిమితి దాటితే అనర్హత వేటే..

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార ఖర్చులపై ఎన్నికల కమిషన్ (ఈసీ) దృష్టి సారించింది. లోక్‌సభ అభ్యర్థుల వ్యయ పరిమితిని రూ.95 లక్షలుగా, అసెంబ్లీ అభ్యర్థుల వ్యయ పరిమితిని రూ.40 లక్షలుగా ఈసీ నిర్ణయించింది. నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఫలితాలు వచ్చే వరకూ అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఈసీ నియమించిన పరిశీలకులు లెక్కిస్తారు. అభ్యర్థి తన ఎన్నికల ప్రచారానికి చేస్తున్న ఖర్చును నిబంధనలకు అనుగుణంగా లెక్కించాలి. సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రకటనలు, వాల్ పోస్టర్లు, వాహనాలకు సంబంధించిన వ్యయాన్ని నమోదు చేయాల్సి ఉంటుంది.

ధరలకు అనుగుణంగా ఖర్చు

మార్కెట్ ధరలు ఎప్పటికప్పుడు పెరుగుతున్న నేపథ్యంలో ఖర్చులను అంచనా వేయడానికి ధరల ద్రవ్యోల్బణ సూచిని ఎన్నికల కమిషన్ ప్రామాణికంగా తీసుకుంటుంది. అభ్యర్థి ఏదైనా ప్రాంతీయ బ్యాంకు ఖాతా తెరచి, దాని ద్వారా ఎన్నికల ఖర్చుల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన 30 రోజుల లోపు అభ్యర్థులు తమ ఖర్చు వివరాలను బిల్లులతో సహా అధికారులకు అప్పగించాలి. లేకుంటే అభ్యర్థిపై అనర్హత వేటు పడుతుంది.

పక్కాగా పరిశీలన

ఓటర్లను డబ్బులతో, ఇతర ప్రలోభాలతో మభ్యపెట్టకుండా ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించే లక్ష్యంతో ఖర్చులను ఈసీ నియంత్రిస్తోంది. ప్రతి రోజూ అభ్యర్థులు ఎక్కడెక్కడ ప్రచారాలు నిర్వహిస్తున్నారు.. ప్రచారంలో భాగంగా ఎంత ఖర్చు చేస్తున్నారనే అంశాలపై ఈసీ ఎప్పటికప్పుడు వ్యయ పరిశీలన చేయిస్తుంది. వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, నిఘా బృందాలు, వీడియో సర్వైలెన్స్ బృందాలు ఈ సమాచారం సేకరిస్తాయి. అభ్యర్థుల ఖర్చుల పరిశీలనకు ఆడిట్ బృందాలు పని చేస్తాంటాయి. ఆయా పార్టీల అభ్యర్థులు నిర్వహించే సభలతో పాటు ర్యాలీలు, రోడ్‌షోలలో ఖర్చు చేసే కుర్చీల నుంచి భోజనం, టీ, కాఫీ వరకూ అన్నీ లెక్కిస్తారు.

వివరాలు చెప్పాల్సిందే..

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోటీలో నిలిచే అభ్యర్థులు ఖర్చు చేసిన ప్రతి రూపాయికీ లెక్కలు చూపించాల్సిందే. ఖర్చుల వివరాలన్నీ ఎన్నికల కమిషన్‌కు చెప్పాల్సి ఉంటుంది. పరిమితికి మించి ఖర్చు చేస్తే అనర్హత వేటు తప్పదు.

– సురేష్‌బాబు, కాకినాడ జిల్లా ఆడిట్ అధికారి, ఎక్స్‌పెండిచర్ నోడల్ అధికారి

క్లుప్తంగా

ఇరువర్గాల మధ్య ఘర్షణ

ముగ్గురికి గాయాలు

రౌతులపూడి: మండలంలోని శృంగవరంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. శృంగవరంలో గురువారం ఉదయం ఒకే సామాజిక వర్గానికి చెందిన మద్దెల శివనాగు, నడిపల్లి శ్రీనుకు అదే గ్రామానికి చెందిన బడే కొండబాబుకు మధ్య మద్యం మత్తులో వివాదం తలెత్తింది. ఈ కొట్లాటలో బడే కొండబాబుకు తీవ్ర గాయం కాగా, మద్దెల శివానాగు, నడిపల్లి శ్రీను గాయపడ్డారు. ఈ ఘర్షణపై స్థానికులు రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబీకి సమాచారం అందించారు. పెద్దాపురం డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆదేశాల మేరకు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి తరలించారు. ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నబీ తెలిపారు.

పాల లారీ బోల్తా



కొత్తూరు-వెదురుమూడి రోడ్డులో బోల్తా పడిన పాల లారీ

ఆలమూరు: మండలంలోని కొత్తూరు-వెదురుమూడి రోడ్డులోని పెదపళ్ల వద్ద హెరిటేజ్ కంపెనీకి చెందిన పాల లారీ బోల్తా పడింది. కె.గంగవరం మండలంలోని పామర్రులోనున్న ఫ్యాక్టరీ నుంచి అమలాపురం వెళ్తుండగా స్థానిక ఇటుక బట్టీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న పుల్లల లారీని తప్పించబోయి పంటకాలువలోకి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ గంటా సుబ్రహ్మణ్యం, క్యాషియర్ శ్రీధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు సత్వరమే స్పందించి 108 వాహనంలో మండపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అందులో ఉన్న పాల పదార్థాలను మరో లారీలోకి ఎక్కించి గమ్య స్థానానికి చేర్చేందుకు చర్యలు చేపట్టారు.

ఏపీ పాలిసెట్‌లో మరోసారి సత్తా చాటిన శశి



వేలివెన్ను శశి క్యాంపస్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన కె.లోకేష్ శ్రీహర్షను అభినందిస్తున్న శశి వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మి సుప్రియ

ఉండ్రాజవరం: పాలిసెట్-2024 ఫలితాలలో శశి వేలివెన్ను క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు స్టేట్ మొదటి ర్యాంకుతో పాటు ఉత్తమ ర్యాంకులతో తమ విద్యాసంస్థ ప్రతిభను రాష్ట్రవ్యాప్తంగా చాటి చెప్పారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ తెలిపారు. కుమ్మరపురుగు లోకేష్ శ్రీహర్ష 120 మార్కులకు 120 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించారన్నారు. కాకర్ల శ్రీసాయినాథ్, రెడ్డి జీవన్, సిరిమల్ల లక్ష్మి తనుష్క, గుడ్ల సాహితి 119 మార్కులతో స్టేట్ 7వ ర్యాంకుతో పాటు కె.ప్రేమ్‌కుమార్, ఆకుల శ్యామ్ కృష్ణ స్టేట్ 14వ ర్యాంకు, నీల వర్షిత స్టేట్ 21వ ర్యాంకు సాధించారన్నారు. 10 లోపు 5ర్యాంకులు, 50 లోపు 9, 100లోపు 21, 200 లోపు 36, 500లోపు 62, 1,000లోపు 97 ర్యాంకులు సాధించారని చెప్పారు. విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీ సుప్రియ అభినందించారు.

దళితులకు పెద్ద పీట

'సాక్షి'తో మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ



తుని: గత టీడీపీ ప్రభుత్వం దళితులను ఓటుబ్యాంకుగా వాడుకుందని, ఇందుకు భిన్నంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ పదవులను ఇచ్చి గౌరవం పెంచిందని మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ తెలిపారు. అటువంటి పార్టీలో సేవ చేసే భాగ్యం కలగడం ఆనందంగా ఉందని ఆమె చెబుతున్నారు. నాలుగున్నర ఏళ్లలో కార్పొరేషన్ ద్వారా జరిగిన మేలును 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అమ్మాజీ వివరించారు.

ప్రశ్న: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు ఎటువంటి స్థానాన్ని కల్పించారు?

చైర్మన్: ఈ ప్రభుత్వంలో దళితులకు పెద్ద పీట వేశారు. కోటనందూరు మండలానికి చెందిన నాకు మాల కార్పొరేషన్ చైర్మన్ పదవిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారు. నాలాంటి సామాన్యులు ఎంతోమందికి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి పదవులు లభించాయి. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమం అందించారు.

ప్రశ్న: గత ప్రభుత్వంలో కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలో ఎంతమందికి ఎన్ని కోట్లు ప్రయోజనం జరిగింది?

చైర్మన్: గత ప్రభుత్వ హయాంలో 2014-15 నుంచి 2018-19 వరకు రూ.3,669.06 కోట్లతో 2,35,420 మంది షెడ్యూల్ కులాలకు చెందిన వారికి జీవనోపాధి కల్పించారు. లబ్ధిదారుల ఎంపికను జన్మభూమి కమిటీలకు అప్పగించడంతో అర్హత ఉన్నా చాలామందికి కార్పొరేషన్ నుంచి ప్రయోజనం అందలేదు.

ప్రశ్న: ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కార్పొరేషన్ ద్వారా ఎంతమందికి ప్రయోజనం చేకూరింది. ఎన్ని కోట్లు ఎంతమందికి ఇచ్చారు?

చైర్మన్: ఈ ప్రభుత్వం వచ్చాక 2019-20 నుంచి 2023-2024 వరకు వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా రూ.12,215.73 కోట్లను 12,13,969 మంది షెడ్యూల్ కులాలకు చెందిన లబ్ధిదారులకు ఇచ్చాం. నవరత్నాలు పథకాల ద్వారా రూ.15,601.46 కోట్లను 15,13,649 మంది షెడ్యూల్ కులాలకు చెందిన లబ్ధిదారులకు అందజేశాం.

ప్రశ్న: నవరత్నాల పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ఎలా చేశారు?

చైర్మన్: నవరత్నాల పథకాలకు అర్హత కలిగిన అందరినీ ఎంపిక చేశాం. వలంటీర్ల ద్వారా దరఖాస్తులు సేకరించి సచివాలయాల్లో పరిశీలించి మంజూరు చేశారు. మధ్యవర్తులు, దళారీల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో (డీబీటీ) ద్వారా జమ చేశాం. ఇంత పారదర్శకంగా ఏ ప్రభుత్వం చేయలేదు.

అంతంతమాత్రం నుంచి సంతృప్త స్థాయికి..

- టీడీపీ ప్రభుత్వంలో బ్రాహ్మణుల సంక్షేమానికి రూ.216 కోట్లు
- అదే వైఎస్సార్ సీపీ సర్కారులో రూ.780 కోట్ల లబ్ధి
- బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాలు నవరత్నాలతో భర్తీ
- అర్చకుల పదవీ విరమణ తొలగించి వంశ పారంపర్య సేవలు
- రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ పీకే రావుతో 'సాక్షి' ఇంటర్వ్యూ



అమలాపురం టౌన్: గత చంద్రబాబు ప్రభుత్వంలో బ్రాహ్మణులకు అరకొర సంక్షేమం అందితే ప్రస్తుత ప్రభుత్వంలో వారికి నవ రత్నాలతోనే కాకుండా పలు హామీల అమలుతో సంతృప్తికరమైన సంక్షేమం అందుతోందని రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు (పీకే రావు) అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండల కేంద్రం అంబాజీపేటలోని తన స్వగృహంలో పీకే రావు బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా అందుతున్న సంక్షేమం గురించి 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. ముఖ్యమంత్రి జగన్ తాను ఇచ్చిన హామీకి కట్టుబడి అర్చకులకు 65 ఏళ్లకు పదవీ విరమణ నిబంధనను రద్దు చేసి, వారికి వంశ పారంపర్యంగా ఆయా ఆలయాల్లో సేవలు అందించే అవకాశాన్ని కల్పించడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలో ఉన్న దాదాపు 40 లక్షల మంది బ్రాహ్మణులకు ఈ సంక్షేమ లబ్ధి చేకూరిందన్నారు. ఇంటర్వ్యూలో పీకే రావు గత టీడీపీ ప్రభుత్వంలో బ్రాహ్మణులకు అందించిన సంక్షేమాన్ని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందుతున్న సంక్షేమ పథకాలను పోల్చినప్పుడు ఈ ప్రభుత్వంలో కొన్ని రెట్లు అదనంగా అమలయిందని గుర్తు చేశారు.



ఇంటర్వ్యూ సారాంశం ఆయన మాటల్లోనే..

- బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా గత టీడీపీ ప్రభుత్వంలో బ్రాహ్మణుల సంక్షేమానికి రూ.216 కోట్లు కేటాయిస్తే అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గత అయిదేళ్లలో రూ.780 కోట్ల మేర సంక్షేమం అందింది.
- గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమం ద్వారా కేవలం 50,121 బ్రాహ్మణులకు లబ్ధి చేకూరితే ఈ ప్రభుత్వం ద్వారా అయిదేళ్లలో 1,30,914 మందికి ప్రయోజనం చేకూరింది.
- టీడీపీ ప్రభుత్వంలో భారతి విద్యా పథకం ద్వారా ఏటా విద్యార్థులకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకూ లబ్ధి చేకూరగా ఇప్పుడు అమ్మ ఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు అందుతోంది.
- గరుడ పథకం కింద చనిపోయినవారికి అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల వంతున అయిదేళ్లలో 2,434 కుటుంబాలకు రూ.2 43 కోట్లు అందించింది.
- కశ్యప పథకం కింద గత టీడీపీ ప్రభుత్వంలో 16,200 మందికి మాత్రమే తక్కువ మొత్తంలో నెలనెలా పెన్షన్ అందితే ఈ ప్రభుత్వంలో 50,222 మందికి వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం కింద ప్రస్తుతం నెలకు రూ.3 వేల వంతున లబ్ధి అందుతోంది.
- ఈబీసీ కింద 25,300 మందికి రూ.73.96 కోట్ల లబ్ధి చేకూరింది.
- బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా తక్కువ వడ్డీతో సుమారు 40 వేల మందికి దాదాపు రూ.200 కోట్ల మేర రుణాలు ఇచ్చాం.
- గుంటూరులో ఉన్న ఎడవల్లివారి సత్రం, నెల్లూరులో ఉన్న అయిలూరి వెంకయ్యపంతుల సత్రం ఈ ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకున్నాయి.

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం



కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన ఎన్ఆర్ఐల బృందం



వీరవరంలో తోట నరసింహంను కలిసిన ఎన్ఆర్ఐల బృందం

కిర్లంపూడి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయం తథ్యం అని ఎన్ఆర్ఐ టీమ్ లీడర్ మేడపాటి వెంకట్ అన్నారు. విదేశాలలో స్థిరపడ్డ పలువురు ఎన్ఆర్ఐలు ఒక టీమ్‌గా ఏర్పడి వైఎస్ జగన్‌ను సీఎం చేయడమే ధ్యేయంగా ఊరూరా బస్సులో ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా గురువారం కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభంను, వీరవరంలో తోట నరసింహంను, తోట రాంజీను గురువారం మర్యాద పూర్వకంగా కలిసినట్టు తెలిపారు. జగపతినగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ముద్రగడ గిరిబాబును కలిసి ఆయనతో పాటు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ టీమ్ లీడర్ వెంకట్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్‌కు నియోజకవర్గంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జీను మహేష్‌బాబు, యల్లప్రగడ కార్తీక్, యశ్వాంత్, బ్రహ్మ, ప్రతాప్, కుమార్ స్వామి, వెంకట రామయ్య పాల్గొన్నారు.

అదుపు తప్పి గోడను ఢీకొన్న కారు



కల్యాణ మంటపం ప్రహరీని ఢీకొన్న కారు

యానాం: యానాం బైపాస్ రహదారిని చేర్చి ఉన్న భీమ్‌నగర్ వైపున గురువారం కారు అదుపు తప్పి గోడను ఢీకొన్న ఘటనలో త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం బైపాస్ రహదారి కుడివైపు నుంచి ఎడమవైపునకు భీమ్‌నగర్ నుంచి ఫెర్రీరోడ్డుకు చేరే రహదారిలో కారు వేగంగా వచ్చింది. దీంతో కారు అదుపుతప్పి భీమ్‌నగర్ కల్యాణ మంటపం ప్రహరీని ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్పగాయాలయ్యాయి. కారు ముందు భాగం ఛిద్రమైంది. ఈ ఘటనపై పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు.

రూ.3 లక్షల మందుల స్వాధీనం

లైసెన్స్ లేని మందుల షాపుపై ఔషధ తనిఖీ అధికారుల దాడులు

అమలాపురం టౌన్: అమలాపురం కాలేజీ రోడ్డులో లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్న శ్రీలక్ష్మి చర్మ వ్యాధుల ఆస్పత్రిపై ఔషధ అధికారులు గురువారం దాడులు చేశారు. ఆ షాపు నుంచి రూ.3 లక్షల విలువైన మందులను స్వాధీనం చేసుకున్నారు. ఆస్పత్రి డాక్టర్ ప్రసాద్‌ను ఔషధ అధికారులు లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్న విషయంపై ప్రశ్నించారు. అమలాపురం, రాజమహేంద్రవరం ఔషధ తనిఖీ అధికారులు కేవీ భూపేష్, ఎ.కృష్ణ ఈ దాడులు నిర్వహించారు. స్వాధీన పరుచుకున్న మందుల విషయాన్ని ఔషధ తనిఖీ అధికారులు కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు.



మందులను స్వాధీనం చేసుకుంటున్న ఔషధ తనిఖీ అధికారులు

రూ.కోటి 19 లక్షల సీజ్



సాక్షి అమలాపురం: అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఈ నెల ఎనిమిదో తేదీ వరకు నగదు రవాణాకు సంబంధించి ఆధారాలు చూపలేని రూ.1,19,78,926 సీజ్ చేశామని జిల్లా కలెక్టర్ శుక్లా తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన చేస్తూ పరిమితమైన నగదు రవాణా సంబంధించి సరైన ఆధారాలు చూపిన వారి నిధులను ఎప్పటి కప్పుడు రిలీజ్ చేస్తామన్నారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు సాధారణ ఎన్నికల ప్రచార గడువు ముగియనున్నందున భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈ జిల్లాలో ఓటర్లు కాకుండా జిల్లా నివాసి కాని వారు స్థానికంగా లాడ్జిలు, హోటల్లో ఎన్నికలు పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు తాత్కాలిక వసతి, నివాసాలు చేయరాదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా స్పష్టం చేశారు. ఈ విషయాన్ని అందరూ గమనించి జిల్లా నివాసులు కాని వారు ఆ సమయంలో స్థానికంగా ఉండకుండా తమ జిల్లాలకు వెళ్లాల్సిందిగా ఆయన ప్రకటనలో తెలిపారు. లాడ్జిలు, హోటల్స్ యాజమాన్యాలు బయట జిల్లాల వారు స్థానికంగా బస చేయకుండా చూడాలన్నారు.

జాతీయ రాజకీయాల్లో కపిలేశ్వరపురం జమీందార్లు

కేంద్ర మంత్రులుగా శ్రీబలుసు సోదరులు

కపిలేశ్వరపురం: జాతీయ రాజకీయాల్లో కపిలేశ్వరపురం జమీందార్లకు ప్రత్యేక స్థానం ఉంది. జమీందారు బలుసు బుచ్చిసర్వారాయుడు, లక్ష్మీ వెంకట సుబ్బమ్మారావు దంపతుల కుమారులైన ఎస్‌బీ ప్రభాకర పట్టాభిరామారావు, ఎస్‌బీపీబీకే సత్యనారాయణరావు కేంద్ర సహాయ మంత్రులుగా పనిచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పలు మంత్రి పదవులను చేపట్టిన జమీందార్లు ఎన్నికల సమయాల్లో జిల్లా రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేసేవారు. స్వాతంత్ర్యం వచ్చిన రోజుల్లోని రాజకీయాల నుంచి వాజ్‌పేయి పాలన వరకూ జమీందార్లు రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ తమదైన చతురతను ప్రదర్శిస్తూ పలు పదవులను అలంకరించారు. టంగుటూరి ప్రకాశం పంతులు నేతృత్వంలోని తొలి ఆంధ్రరాష్ట్ర మంత్రివర్గంలో పట్టాభిరామారావు విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. తర్వాత బెజవాడ గోపాలకృష్ణ మంత్రి వర్గంలోనూ పనిచేశారు. తరువాత కాలంలో ఢిల్లీ రాజకీయాల్లోకి ప్రవేశించి ఇందిరాగాంధీ మంత్రివర్గంలో పరిశ్రమల శాఖ, ఆర్థిక శాఖల సహాయ మంత్రిగా పనిచేశారు. ఐదవ (1971), ఆరవ (1977), ఏడవ(1980) లోక్‌సభలలో సభ్యుడిగా పనిచేశారు. 1955లో తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన పట్టాభిరామారావు 1953లో ఆంధ్రా యూనివర్సిటీ సెనేట్ సభ్యుడిగా కూడా వ్యవహరించారు.



కపిలేశ్వరపురం దివాణం



ఎస్‌బీ ప్రభాకర పట్టాభి రామారావు (ఫైల్)



సత్యనారాయణరావు (ఫైల్)

వాజ్‌పేయి మంత్రి వర్గంలో సత్యనారాయణరావు కపిలేశ్వరపురం జమీందారు ఎస్‌బీపీబీకే సత్యనారాయణరావు కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పలు కీలక పదవులు చేపట్టారు. చంటి దొరగా పిలిచే ఈయన పూర్తిపేరు శ్రీబలుసు ప్రభాకర బుచ్చికృష్ణ సత్యనారాయణరావు. 1999 ఎన్నికల్లో రాజమండ్రి పార్లమెంటు స్థానం నుంచి ఎంపీగా గెలుపొంది అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో వ్యవసాయశాఖ సహాయమంత్రిగా పనిచేశారు. బీఏ చదివిన ఈయన 1953 జూలై 8న కపిలేశ్వరపురం గ్రామ అధ్యక్షుడిగా రాజకీయ ప్రవేశం చేశారు. ఈ పదవిలో 1959 వరకూ కొనసాగారు. తరువాత 1959 నవంబర్ 1న కపిలేశ్వరపురం పూర్వపు పంచాయతీ సమితి అధ్యక్షుడిగా పదవిని చేపట్టి 1964 వరకూ కొనసాగారు. 1958 నుంచి 1964 వరకూ శాసనమండలి సభ్యునిగా పనిచేశారు. అనంతరం ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ స్థానం నుంచి మరోమారు ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 1964 సెప్టెంబర్ 11 నుంచి -1976 వరకూ తూర్పుగోదావరి జిల్లా పరిషత్తు అధ్యక్షుడిగా పనిచేశారు. తన 25వ ఏట కపిలేశ్వరపురం ఉత్పత్తిదారుల, వినియోగదారుల సహకార సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికై సుమారు ఇరవై ఏళ్లు పనిచేశారు. సత్యనారాయణరావు అఖిల భారత స్థాయిలో ఇండియన్ సుగర్స్ మిల్లు అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టి యువకుడి మృతి

రావులపాలెం: మొక్కలకు నీరు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను వెనుక నుంచి బైక్‌పై వచ్చి ఢీ కొట్టిన ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని గోపాలపురానికి చెందిన యువకుడు వేమన వెంకటేశ్వర్లు(27) మోటారు సైకిల్‌పై రావులపాలెం వస్తున్నాడు. జాతీయ రహదారిపై స్థానిక అవంతి ఫ్యాక్టరీ వద్ద మొక్కలకు నీరు పోస్తున్న ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టాడు. దీంతో కిందపడగా తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొత్తపేట ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ వైకుంఠరావు తెలిపారు.



ప్రమాద స్థలంలో వెంకటేశ్వర్లు మృతదేహం

అక్రమ మద్యం పట్టివేత

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణాపై నిఘా బృందాలు దాడులను మరింత పెంచాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల వివరాలను, అక్రమ మద్యం పట్టివేత, అరెస్ట్‌ల వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం గురువారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపింది.

- జిల్లాలో ఎస్ఈబీ నిఘా బృందాలు మద్యం అక్రమ రవాణాపై దాడులు నిర్వహించి 11 కేసులను నమోదు చేసి 10 మందిని అరెస్ట్ చేశాయి. వారి నుంచి 88 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 3 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 18.97 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్, ఒక లీటరు నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.
- రాయవరం పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్ఈబీ నిఘా బృందాలు ఒక కారు షెడ్‌ను తనిఖీ చేసి రూ.96 వేల విలువైన 762 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 137.16 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నాయి.
- రావులపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న అయిదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.5,200 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- కొత్తపేట మండలం పలివెల గ్రామంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా పోలీస్ అబ్జర్వర్ ఎంవీ చంద్రకాంత్ తనిఖీ చేశారు.
- జిల్లాలో గోపాలపురం, జొన్నాడ, బొబ్బర్లంక, ఎదుర్లంక,దిండి, నరసాపురపు పేటల వద్ద ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల్లో నిఘా బృందాలు పలు వాహనాలను ఆపి విస్తృత తనిఖీలు చేశాయి.
- జిల్లాలోని పలు గ్రామాల్లో స్థానిక పోలీసు అధికారులు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించి పహరా కాశారు.



సమస్యాత్మక గ్రామాల్లో పహరా కాస్తున్న కేంద్ర బలగాలు

స్టోరేజ్ ట్యాంక్‌లో పడి కాంట్రాక్ట్ వర్కర్ మృతి

కాకినాడ రూరల్: మండలంలోని పి.వెంకటాపురం వద్ద పండూరు సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ స్టోరేజ్ ట్యాంక్‌లో ప్రమాదవశాత్తూ పడి అక్కడ కాంట్రాక్ట్ ప్రాతిపదికన పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న యు.కొత్తపల్లి మండలం వాకతిప్ప సతీష్ చంద్ర కాలనీకి చెందిన సిద్ది వెంకటదుర్గాప్రసాద్(38)మృతి చెందాడు. ఉదయమే ఇంటి వద్ద నుంచి విధులకు వాటర్ స్కీమ్ వద్దకు వచ్చిన దుర్గాప్రసాద్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద చనిపోయిన చేపల నుంచి దుర్గంధం రావడంతో తొలగించే ప్రయత్నంలో గట్టుపై నుంచి సుమారు 20 అడుగుల లోతు గల స్టోరేజ్ ట్యాంక్‌లో పడిపోయాడు. సహచర సిబ్బంది బయటకు తీసే ప్రయత్నం చేయగా మృతి చెందాడు. మృతుడికి భార్య మీనాక్షి, ఇద్దరు కుమారులు ఉన్నారు. చేనేత కుటుంబానికి చెందిన దుర్గాప్రసాద్ 10నెలలుగా పండూరు వాటర్ స్కీమ్ వద్ద పనిచేస్తూ ఏసీ రిపేరు వర్క్ నేర్చుకుంటున్నాడు. ప్రమాదం గురించి తెలుసుకున్న దుర్గాప్రసాద్ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. తోటి వర్కర్లు దుర్గాప్రసాద్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేయడంతో సీపీడబ్ల్యూఎస్ నిర్వహణ బాధ్యత చేపడుతున్న కాంట్రాక్టర్ పరిహారం అందించేందుకు ముందుకు వచ్చాడు. సంఘటనపై మృతుడు తండ్రి జగ్గారావు ఫిర్యాదు మేరకు తిమ్మాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించిన తరువాత కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.



దుర్గాప్రసాద్ మృతదేహం



దుర్గాప్రసాద్ (ఫైల్)